క్లుప్తంగా

చేనేత దినోత్సవ శుభాకాంక్షలు


కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేనేత కార్మికులు, వ్యాపారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనాది కాలం నుంచి చేనేతలకు పుట్టిల్లుగా ధర్మవరం విరాజిల్లుతోందని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఎలాంటి సమస్యలు లేకుండా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

వ్యాపారి అరెస్ట్ అన్యాయం


మాట్లాడుతున్న జ్యువెలర్స్ సంఘం అధ్యక్షుడు ఖలీల్ రెహమాన్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షాజీన్ అనే జ్యువెలర్స్ వ్యాపారిని చిత్రదుర్గ పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని జ్యువెలర్స్ సంఘం పట్టణ అధ్యక్షుడు ఖలీల్ రెహమాన్, ఉపాధ్యక్షుడు కేహెచ్ ప్రకాష్, రవూఫ్ పేర్కొన్నారు. మంగళవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో జ్యువెలర్స్ షాపు యజమానులు పోలీసులను కలిసి వినతిపత్రం అందించారు. షాజీన్ దొంగ బంగారం కొన్నాడని కొద్దిరోజుల క్రితం అనంతపురం పోలీసులకు పూర్తిగా రికవరీ చేసి ఇచ్చాడన్నారు. మరోసారి అదే కేసు మీద చిత్రదుర్గ పోలీసులు వ్యాపారిని తీసుకెళ్లడం సమంజసం కాదన్నారు. బంగారు వ్యాపారిని విడుదల చేసే వరకు పోరాటాం చేస్తామని తెలిపారు.

ఆవుల అపహరణ

ముదిగుబ్బ: సంకేపల్లి గ్రామంలో రైతు శ్రీరాములకు చెందిన రెండు ఆవులు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోలుకుపోయినట్లు బాధితుడు తెలిపాడు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

అనారోగ్యంతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి


ఆంజనేయులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమ్మర ఆంజనేయులు (58) సోమవారం రాత్రి మృతి అనారోగ్యంతో చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న ఆంజనేయులును మూడు రోజుల క్రితం అనంతపురంలో వైద్యం చేయించారు. తర్వాత ఇంటికి వచ్చారు. ఒక్కసారిగా పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు ఓబుళపతి ఉన్నారు. ఆంజనేయులు వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పని చేసేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన


అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 15న అన్నా క్యాంటీన్లను ప్రారంభించనున్న నేపథ్యంలో జేసీ ప్రభుత్వ ఆసుపత్రి పక్కనున్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి పనులపై ఆరా తీశారు. ఆహారాన్ని పంపిణీ చేసే కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రిప్పు, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్: 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అర్హులైన రైతులు డ్రిప్పు, స్రింక్లర్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఐఏఓ శివశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోరు బావులు కలిగి నీటి వసతి వున్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 7995010080 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అనాథలకు అన్నదానం


కుటుంబ సభ్యులతో కలిసి అన్నదానం చేస్తున్న కోటి నరేష్‌కుమార్

బత్తలపల్లి: బత్తలపల్లి ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేష్‌కుమార్ తన జన్మదినం సందర్భంగా మంగళవారం సేవాకార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువ గ్రామంలోని ఆశ్రయ అనాథాశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఎగువపల్లి సమీపంలో హంద్రీనీవా కాలువపై ఏపుగా పెరిగిన కంపచెట్లు


ప్రస్తుతం చెర్లోపల్లి రిజర్వాయర్


అడుగంటిన రిజర్వాయర్

ముందు చూపేదీ..?

- కాలువల్లో ఏపుగా పెరిగిన కంపచెట్లు
- అక్కడక్కడ దెబ్బతిన్న కాలువ గట్లు
- నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగేదెన్నడు?

కదిరి అర్బన్: శ్రీశైలం ప్రాజెక్టు నిండింది. హంద్రీ–నీవా కాలువకు కృష్ణాజలాలు విడుదల చేశారు. అయితే కాలువల్లో దట్టంగా పెరిగిన కంపచెట్లు, పిచ్చిచెట్లతో నీటి ప్రవాహం సాఫీగా సాగే పరిస్థితి లేదు. అక్కడక్కడా వర్షాలకు కాలువగట్లు తెగి బలహీన పడ్డాయి. నీటి విడుదలకు ముందే ఇటువంటి అడ్డంకులు అధిగమించడానికి, కాలువ గట్లు పటిష్ట పరచడానికి కూటమి ప్రభుత్వం ఎటువంటి ముందస్తు చర్యలూ చేపట్టలేదు. దీంతో కదిరి మండలంలోని చెర్లోపల్లి జలాశయానికి నీటిరాక ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. పట్నం సమీపంలో నాగారెడ్డిపల్లి నుంచి హంద్రీ – నీవా 22వ ప్యాకేజీ ప్రారంభమవుతుంది. మొత్తం 75 కిలోమీటర్ల మేర ఈ కాలువ కదిరి నియోజకవర్గంలో ప్రవహిస్తుంది. మొత్తం కాలువపై 10 పంప్‌హౌస్‌లు ఉన్నాయి.

లీకేజీతో ముంపు ఖాయం..

కె.బత్తలపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువ ఏళ్ల తరబడి లీకేజీ అవుతూనే ఉంది. ఈసారి నీరు వదిలినా లీకేజీ కారణంగా గ్రామం ముంపునకు గురవడం ఖాయం. ఈ విషయంపై గ్రామస్తులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లీకేజీని అరికట్టడానికి కాలువకు లైనింగ్ ఏర్పాటు చేయాలని అప్పటి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ ఎటువంటి పురోగతీ లేదు.

డెడ్ స్టోరేజీకి చేరిన రిజర్వాయర్

చెర్లోపల్లి రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 1.608 టీఎంసీలు. ప్రస్తుతం డెడ్‌స్టోరేజీ 0.330 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. నీటి విడుదల జరిగితే రిజర్వాయర్ పూర్తిగా నిండేందుకు నెలరోజుల సమయం పట్టొచ్చు. కాలువల్లో ఎలాంటి అడ్డకులూ లేకుండా ఉంటే తొందరగా రిజర్వాయర్ నిండిపోతుంది. కాలువలో నీరు ప్రవహిస్తూ రిజర్వాయర్ పూర్తిగా నిండితే ఈ ప్రాంతంలో భూగర్భజలాలు పెంపొందుతాయి. కదిరి నియోజకవర్గం పరిధిలో కాలువ పొడవునా 10,000 ఎకరాలకుపైగా బోరు బావుల కింద పంటలు సాగవుతాయి.

కాలువ చుట్టూ కంపచెట్లు



కదిరి మండలంలో హంద్రీ–నీవా కాలువ చుట్టూ కంపచెట్లు దట్టంగా పెరిగాయి. నీరు రాకముందే వీటిని తొలగించాలి. పూడిక తీత పనులు కూడా చేపట్టాలి. అప్పుడే నీరు సాఫీగా ముందుకు సాగుతుంది. లేకుంటే లీకేజీలు తప్పవు. లీకేజీలతో పంట పొలాలు దెబ్బతింటాయి.

– రాజారెడ్డి, రైతు, కదిరి

ప్రభుత్వానికి నివేదించాం

హంద్రీ–నీవా నీటి విడుదల తేదీ ఉన్నతాధికారులు చెప్పలేదు. సమయం పట్టొచ్చు. కర్నూలు వరకు కృష్ణా జలాలు వచ్చాయని తెలిసింది. ఇంకా అనంతపురం రావాలి. జీడిపల్లి, గొల్లపల్లి రిజర్వాయర్లకు వచ్చాక చెర్లోపల్లి రిజర్వాయర్‌కు నీరు వస్తుంది. కాలువలో జంగిల్ క్లియరెన్స్, షిల్ట్ తీసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. అనుమతి రాగానే పనులు చేస్తాం. కె.బత్తలపల్లి వద్ద కాలువ లీకేజీకి లైనింగ్ ఏర్పాటు చేయాలని కూడా నివేదించాం.

– విశ్వనాథం, డీఈ, హెచ్ఎన్ఎస్ఎస్

25న సాహితీ యాత్ర

కదిరి అర్బన్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న కదిరిలో వేమన సాహితీ యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం సభ్యులు చిన్నారావ్, బాబా ఫక్రోద్దీన్, శంకర్‌నారాయణరాజు తదితరులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కదిరి నుంచి సాగే యాత్రలో కటారుపల్లిలోని వేమన స్మారక మందిరం, తిమ్మమ్మమ్రిమానుల వద్ద కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వేమన ప్రస్థానం, 77 సంవత్సరాల భారతావని, రాయలసీమ రైతన్న తల్లిదండ్రులు అనే అంశాలపై కవిత, కథ, వ్యాసాలు రాయవచ్చని తెలిపారు. ఇందులో పాల్గొనే రచయితలు 92477 95321 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అక్రమాలపై విచారణకు వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కాళసముద్రం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేయాలని సర్పంచ్ లలితమ్మ, గ్రామస్తులు ఇబ్రహీం, నరేష్, కిరణ్‌కుమార్ తదితరులు మంగళవారం ఎంపీడీఓ అంజనప్పకు వినతిపత్రం సమర్పించారు. కాళసముద్రం, నడింపల్లి గ్రామాల్లో గతంలో చేసిన పనులకే తాజాగా రెండోసారి బిల్లులు పెట్టారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సర్పంచ్ లలితమ్మ,ఇబ్రహీం, నరేష్, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు


గంగమ్మతల్లి దేవస్థానం

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని చెరువు సమీపాన రజక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి దేవస్థానంలో బుధవారం నుంచి మూడు రోజులు పాటు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులు విలేకర్లతో మాట్లాడుతూ రజక అభివృద్ధి కమిటీ, గ్రామ పెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో రూ.10 లక్షలు వెచ్చించి దేవస్థానం నిర్మించినట్లు తెలిపారు. దాతల సహకారంతోనే గంగమ్మతల్లి, పోతలయ్యస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్టాపనా కార్యక్రమాలను వేదపండితులు మంజునాథశర్మ బృందంచే మూడు రోజులు పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భర్త వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

కదిరి అర్బన్: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడంటూ కొండమనాయునిపాళెం గ్రామానికి చెందిన రాజేశ్వరి మంగళవారం రూరల్ మండల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. తన భర్త ఆనంద్‌రెడ్డి, అత్త, మామ,ఆడపడచులు తనను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు


క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న విజయలక్ష్మి

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఆర్టీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. రన్నింగ్ అండర్ –19 విభాగంలో జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఎస్.సుజైన్, షఫియా, లాంగ్ జంప్‌లో ఎస్.సుజైన్ (జెడ్పీహెచ్ నల్లచెరువు), మహేశ్వరి(గురుకుల పాఠశాల), షాట్ పుట్‌లో లీనారెడ్డి (కేజీబీవి తనకల్లు), శైలజ (ఏపీ మోడల్ స్కూల్), 200 మీటర్ల విభాగంలో మహేశ్వరి(గురుకుల పాఠశాల), వేదవతి (కేజీబీవీ తనకల్లు) విజయం సాధించారు. అండర్ –14 విభాగంలో కేజీబీవీ నుంచి గోపిక, గిరిజన బాలికల గురుకుల పాఠశాల సీజీ ప్రాజెక్ట్ నుంచి అరుంధతి, లాంగ్ జంప్‌లో గోపిక, వెన్నెల(నల్లచెరువు), షాట్‌పుట్‌లో మధు, విజయలక్ష్మి విజయం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు కోఆర్డినేటర్ షఫి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సుబహాన్, శ్రీనాథ్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సంధ్యారాణి, రాధ, సుజాత, దర్బార్ బీ, హరి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీపై కంగారు పడొద్దు

అమడగూరు: మండలంలో జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీని మంగళవారం తహసీల్దార్ రామనాథరెడ్డి పరిశీలించారు. తుమ్మలలో పంపిణీని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 29 చౌకధాన్యపు డిపోలు ఉండగా.. ఆరు మాత్రమే ఎండీయూ వాహనాలు ఉండటంతో పంపిణీ ఆలస్యమవుతోందన్నారు. ఇప్పటికే ఒకటో తేదీ నుండి దాదాపు 20 షాపుల్లో పంపిణీ జరుగుతోందని, మిగిలిన వాటిలో రెండు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామన్నారు. నిత్యావసర సరుకుల కోసం గ్రామస్తులు కంగారు పడొద్దని, కచ్చితంగా రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. డీలర్లు సమయం వృథా చేయకుండా వారికి నిర్దేశించిన సమయం మేరకు ఎండీయూ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరెడ్డి, సీనియర్ సహాయకులు శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు

చెన్నేకొత్తపల్లి: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రం సమీపంలోని ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే ఎస్ఎంసీ ఎన్నికకు సంబంధించిన ఓటర్ల జాబితాను పరిశీలించారు. వివరాలను అక్కడి ఉపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. రోజూ భోజనం రుచిగా ఉంటుందా, కడుపు నిండా పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కళాకారుడు అంజినప్పకు ఘన సన్మానం


అంజినప్పను సన్మానిస్తున్న కళాకారులు

ధర్మవరం రూరల్: తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కళాభిషేకం నిర్వాహకుడు నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల ఉపాధ్యాయుడు అంజినప్పను పలువురు కళాకారులు ఘనంగా సన్మానించారు. సోమవారం రాత్రి విశాఖపట్నం మద్దెల పాలెం కళాభారతి ఆడిటోరియంలో విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వంకాయల మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు అంతర్జాతీయ రంగస్థల సీనియర్ నటులు కురిటి సత్యంనాయుడు, కార్యదర్శి ఉప్పాడ అప్పారావు, సినీ దర్శకుడు, నిర్మాత నటులు ఐనవోలు ప్రసన్నకుమార్, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వీవీ రమణమూర్తి, విజయ్ నిర్మాణ్ అధినేత సూరపనేని విజయ్‌కుమార్ హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఈ మార్గంలో ప్రయాణం.. నరకప్రాయం


అధ్వానంగా పెద్దఎద్దుల వారిపల్లి రోడ్డు

తనకల్లు: మండలంలో చీకటిమానిపల్లి నుంచి పెద్ద ఎద్దులవారిపల్లి మీదుగా చిన్న ఎద్దుల వారిపల్లి, కురువవారిపల్లి, రాగినేపల్లి, మార్పురివాండ్లపల్లికి గతంలో వేసిన తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో రోడ్డుపై ప్రయాణం ముందుకు సాగడం లేదు. ద్విచక్రవాహనాలు సైతం సాఫీగా వెళ్లలేని పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు సర్వేశ్వర్ రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, రవి, కొండయ్య కోరుతున్నారు.

'ఓపెన్' టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2024–25 విద్యా సంవత్సరానికి గాను పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ రవీంద్రనాథ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. 28వ తేదీ తర్వాత నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థికి 14 ఏళ్లు నిండి ఉండాలని, ఇంటర్‌కు టెన్త్ ఉత్తీర్ణులై 15 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ లాజర్, మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, లియక్ అలీ, త్రిమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకూడదని, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడితే మాత్రం ఆందోళనలు తప్పవని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు హెచ్చరించారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలో ఉన్న సీపీఐ కార్యాలయంలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకూ ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం విశాఖలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఆ సమ్మేళనానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మధునాయక్, బాబుతో పాటు భవన కార్మిక నాయకులు పాల్గొన్నారు

తల్లిపాలు శిశువుకు శ్రీరామ రక్ష


తనకల్లు మండలం మల్లిరెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి


చెన్నేకొత్తపల్లిలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ కవితాదేవి

తనకల్లు: తల్లిపాలు శిశువుకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని మల్లిరెడ్డిపల్లి, గేమేనాయక్‌తండాలలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమన్నారు. శిశువు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగాలంటే తల్లిపాలతోనే సాధ్యమన్నారు. అనంతరం ' తల్లిపాలు ముద్దు–బుడ్డీ పాలు వద్దు' అంటూ నినాదాలు చేస్తూ ఆయా గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కొడవండ్లపల్లి గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ సురేఖ మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తిని కలిగించే ఆహార పదార్థాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మారాణి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, రాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బిడ్డకు తల్లి పాలే శ్రీరామరక్ష అని బుక్కపట్నం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్య సాయి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కౌసల్యసాయి మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలు తాగించాలని అవి ఎంతో శ్రేష్ఠమైనవన్నారు. తల్లి పాలే బిడ్డకు మొదటి టీకాగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి

ఆత్మకూరు: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి తెలియజేశారు. మంగళవారం ఆత్మకూరులో తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సబిహా సుల్తానా తల్లి పాలతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. తల్లి పాలలో విటమిన్ ఏ ఉంటుందని తెలిపారు. అనంతరం తల్లి పాల వారోత్సవా పోస్టర్లను విడుదల చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: తల్లిపాలు చిన్నారులకు శ్రేష్ఠమైనవని సీడీపీఓ కవితాదేవి అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది అంగన్‌వాడీగుర్తును వివిధ రకాల కూరగాయలు, పండ్లతో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీడీపీఓ తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. ముఖ్యంగా తల్లులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. గర్భవతులు , బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలను వివరించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: చంటి బిడ్డలకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రవినాయక్ అన్నారు. మంగళవారం ఎన్ఎస్‌గేట్‌లోని పిహెచ్‌సీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి తల్లి చిన్నారికి తల్లిపాలు తప్పక ఇవ్వాలన్నారు. పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు వెంకటనారాయణ ,రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థినికి టీసీఎస్‌లో ఉద్యోగం


నస్రీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డి

అనంతపురం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో డిప్లొమో ఈసీఈ విద్యార్థిని ఎస్. నస్రీన్ టీసీఎస్ కంపెనీలో కొలువు దక్కించుకుంది. ప్రస్తుత ట్రైనింగ్‌లోనే ఏడాదికి రూ.2 లక్షల ప్యాకేజీ ఇవ్వనున్నారు. అనంతరం ప్యాకేజీ పెంచనున్నారు. టీసీఎస్‌లో కొలువు దక్కించుకున్న సందర్భంగా ప్రిన్సిపాల్ సి. జయచంద్రారెడ్డి , ఈసీఈ విభాగాధిపతి జి. సుధాకర్‌రెడ్డి, బి. కరుణ కుమార్ విద్యార్థిని అభినందించారు. ఎస్ .నస్రీన్ తండ్రి చాంద్ బాషా ధర్మవరంలో చేనేత కార్మికుడు. డిప్లొమోతోనే మంచి కంపెనీలో కొలువు దక్కించుకోవడం గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.